

శనివారం తన పుట్టినరోజు సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి

## • పెద్దవాగు పొంగె.. రైతన్న గుండె ఉప్పొంగె



*మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం శాఖాపూర్ శివారులోని పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మత్తడి దుంకుతున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో నాటి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో వాగుపై రూ.5 కోట్లతో ఈ చెక్‌డ్యాం నిర్మించారు. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెక్‌డ్యాం జలకళను సంతరించుకొని అలుగుపారుతున్నది. దీంతో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం చెక్‌డ్యాం వద్దకు వెళ్లి గులాబీ పార్టీ జెండాలు పాతారు.* **- మూసాపేట(అడ్డాకుల)**

## వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించొద్దు

- 40 శాతం మందికైనా రుణమాఫీ కాలేదు
- రైతాంగ సమస్యలపై 29న ధర్నాలు
- సీపీఎం నేతలు రాఘవులు, తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించవద్దని, ఆ చట్టంలో మార్పులు చేయాలనుకోవడం తగదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని ఎంబీభవన్‌లో శనివారం సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం రాఘవులు మీడియాతో మాట్లాడారు. భూ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించరాదని, అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి నిర్ణయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. రాష్ట్రంలో కనీసం 40% మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 29న రెవెన్యూ కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నట్టు ప్రకటించారు. 'హైడ్రా' పేరుతో నాటకాలాడొద్దని, దురాక్రమణలను నిర్మూలించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య పాల్గొన్నారు.

## ఐసెట్ షెడ్యూల్ విడుదల

- ఒకటి నుంచి దరఖాస్తులు.. 14న సీట్ల కేటాయింపు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, టీజీ ఐసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన మాసబ్‌ట్యాంకులోని టీజీసీహెచ్‌ఈ కార్యాలయంలో శనివారం ఐసెట్ షెడ్యూల్ విడుదల చేశారు. సెప్టెంబర్ 1 నుంచి 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ఉంటుంది. 3-9వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 4 నుంచి 11వరకు వెబ్‌ఆప్షన్లకు, 14న తొలిదశ సీట్ల కేటాయింపు ఉంటుంది.

## 31వరకు 'యానిమేషన్' దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో యానిమేషన్ కోర్సులో ప్రవేశాలకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ సెక్రటరీ సైదులు శనివారం ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్ పూర్తిచేసినవారు అర్హులని, https://mjptbcwreis.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 90326 44463, 90632 42329 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఇంటర్నల్ స్లైడింగ్‌లో 5,579 సీట్లు మార్పు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కాలేజీల్లో ఇంటర్నల్ స్లైడింగ్‌లో 5,579 మంది విద్యార్థులు సీట్లు మార్చుకున్నట్టు టీజీ ఎప్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్ శ్రీదేవసేన శనివారం ప్రకటనలో తెలిపారు. 5,579 మందికి సీట్లు మార్చామని, 11,836 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు నేడు రిపోర్టు చేయాలని సూచించారు.

## 'గిరిజన సంక్షేమం'లో 2,334 బదిలీలు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): ఎస్టీ గురుకుల టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సంపూర్ణంగా ముగిసిందని ఆ శాఖ అధికారులు తెలిపారు. 2,334 మందికి బదిలీలు, 195 మందికి పదోన్నతులు దక్కాయని వెల్లడించారు. 86 హెడ్‌మాస్టర్లు, 695 స్కూల్ అసిస్టెంట్లు(సమాన క్యాడర్), 1,553 మంది ఎస్జీటీలు ప్రయోజనం పొందినట్టు అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి-మమతారెడ్డి దంపతుల కుమార్తె శ్రేయారెడ్డి నిశ్చితార్థం ఆదిత్యతో జైపూర్‌లో శనివారం వైభవంగా జరిగింది. మాజీ మంత్రులు మల్లారెడ్డి, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఎంఎల్‌ఆర్‌ఐటీ చైర్మన్ లక్ష్మారెడ్డి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. **- మల్కాజిగిరి**














